క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు భూమిపూజ

వీపనగండ్ల: మండలంలోని రంగవరం గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయించామని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బిచ్చన్నసాగర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీవిత పాల్గొన్నారు.

కంటి పరీక్షలు విజయవంతం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం 65 మందికి ఉచితకంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి రాజశేఖర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రఘునందన్ తెలిపారు. మండలంలోని ఆయాగ్రామాల నుంచి వచ్చిన వారికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 45మందికి కంటి ఆపరేషన్లకు గుర్తించి మహబూబ్‌నగర్ తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో వెలసిన లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కొనసాగుతోంది. గురువారం ఆలయంలో గణపతి పూజతో పాటు హోమంను వేదపండితుల సమక్షంలో నిర్వహించారు. శ్రావణమాసంలో భక్తులు ఆలయానికి తరలొచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు తిరుమల ప్రకాష్, రాజు, ప్రసాద్, రవి, కృష్ణ, వెంకటేష్, రఘు, ఎల్లస్వామి పాల్గొన్నారు.

జేఎంఎల్‌బీసీ సమావేశం



కొత్తకోట రూరల్: ఎంపీడీవో కార్యాలయాల్లో గురువారం జాయింట్ మండల లెవల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేవైసీ, జనధన్ ఖాతాలు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ ప్రభుత్వ పథకాల అమలు, అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ రుణాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, ఎల్‌డీఎమ్ శివకుమార్, అసిస్టెంట్ సాయి కుమార్, బ్యాంకు మేనేజర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలసి ఆయన వృద్ధులను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో నిరాధరణకు గురవుతున్న వృద్ధులను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రవి, గిరిరాజ చారి, సంజీవయ్య, వరదాచారి, శ్రీనివాసులు, జ్యోతిలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం ఇవ్వాలి

అమరచింత: మండలంలోని మస్తీపూర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కోసం అనుమతి ఇవ్వాలంటూ శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవర్ల సురేష్, చెన్నంశెట్టి దామోదర్, భరత్, పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు వేరుగా ఇవ్వాలి

వనపర్తిటౌన్: ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరు వేరుగా మున్సిపల్ చెత్తసేకరణ వాహనాలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ మేరకు తడి, పొడి వ్యర్థాల విభజన, సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా పై అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ఏబీసీ ప్రచారం, కుక్కలను పట్టుకోవడం, వాణిజ్య లైసెన్స్ మార్పిడి, వాటర్ క్లోరినేషన్, నీటి పన్ను వసూలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్, సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్స్, పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా..



పాన్‌గల్ మండలంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు (ఫైల్)

- గ్రామాల్లోని మహిళా సంఘాలపై సెర్ప్ నజర్
- రుణాల టార్గెట్‌కు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు

మండలాల వారీగా రుణ లక్ష్యం (రూ.కోట్లలో)

మండలం	సంఘాలు	రుణ లక్ష్యం	రుణం పొందిన	అందించిన సంఘాలు రుణం
పాన్‌గల్	682	26.50	115	8.50
చిన్నంబావి	439	17.26	26	2.98
వీపనగండ్ల	426	16.00	26	3.00

పాన్‌గల్: మహిళాభివృద్ధికి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) వివిధ పథకాల అమలులో భాగంగా రుణాలను అందిస్తూ పొదుపు అలవాట్లను నేర్పుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోంది. కానీ ఇంకా అనేక సంఘాలు ఆశించిన పురోగతి సాధించడంలో వెనుబడుతున్నాయి. ఇలాంటి వాటిని గుర్తించి గాడిన పెట్టే దిశగా క్షేత్ర స్థాయిలో సెర్ప్ ప్రత్యేక దృష్టి సారించింది. సంఘాలకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇచ్చిన టార్గెట్లను నెల వారీగా ఐకేపీ సిబ్బంది పూర్తి చేసేలా ఆయా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

గ్రామాల్లో వెనకడుగు

పట్టణాలతో పోల్చితే పొదుపు సంఘాలు గ్రామాల్లోనే వెనుకబడుతున్నాయి. తీసుకున్న రుణాలను ప్రధానంగా వ్యవసాయాభివృద్ధి పనులకే వెచ్చించడం అలవాటుగా మారింది. పంటల వరకు వాయిదాలను తిరిగి చెల్లించేందుకు నిరీక్షించాల్సి రావడంతో ఎన్‌పీఏగా మారుతున్నాయి.

గ్రేడింగ్‌తో ముందుకు..

గ్రామాల్లోని మహిళా స్వయం సంఘాలకు బ్యాంకులు, స్త్రీనిధి నుంచి రుణాలు అందించి వారు స్వయం ఉపాధి సాధించేందుకు ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రతి ఏడాది రుణ మంజూరు లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోంది. చిన్నచిన్న వ్యాపారాలను చేపడుతూ.. వేలాది మంది ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవడం, తిరిగి బ్యాంకులకు చెల్లించడంతో గ్రేడింగ్ ఇస్తున్నారు. ఇలా ఏ నుంచి డీ వరకు అమలు చేస్తున్నారు. అన్నింటినీ మొదటి స్థానానికి తీసుకొచ్చి పనితీరును మెరుగు పరచాలని కృషి జరుగుతోంది.

సంఘాల బలోపేతమే ధ్యేయం



సంఘాల్లో ఉన్న సభ్యులను ఆర్థికంగా బలోపేతమే చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. వారు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ బ్యాంకులకు చెల్లించే నెలవారి కంతులను రెగ్యూలర్‌గా చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిర మహిళా శక్తి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎత్తం చిట్టెమ్మ, సంఘం అధ్యక్షురాలు, వీపనగండ్ల

అవగాహన కల్పిస్తున్నాం



ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను వివరిస్తూ.. వారు రుణాలు పొంది ఆర్థికంగా బలోపేతం అయ్యే దిశగా సభ్యులకు అవగాహ న కల్పిస్తున్నం.సభ్యులు తీసుకున్న రుణాలను రెగ్యూలర్ గా చెల్లిస్తే వడ్డీ మాఫీతో పాటు కలిగే ప్రయోజనాలు ఉంటాయి. సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నాం. మంత్రి జూపల్లి సహకారంతో మండల సమాఖ్యకు ఆర్టీసీ బస్సు కూడా కేటాయించారు.

– సురేఖ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, పాన్‌గల్

పనితీరే ప్రామాణికం



వెనుకబడిన సంఘాలను గుర్తించి ఏ గ్రేడ్‌లో ఉన్న వాటి సరసన చేర్చడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రధానంగా సభ్యులు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకునే విధంగా మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నచిన్న వ్యాపారాలను చేపట్టి వాయిదాలు చెల్లిస్తే చాలు క్రమంగా వాటి పనితీరు మెరుగుపడేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇచ్చిన టార్గెట్‌లో ఇప్పటికి 32 శాతం పూర్తయింది.

– వెంకటేష్‌యాదవ్, ఏపీఎం, పాన్‌గల్

‘పనుల జాతర’ను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించే ‘పనుల జాతర’ను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు ఉపాధి సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు పనుల జాతరపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీల్లో పశువుల పాకలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, పండ్ల తోటల గుంతలు తీయుట, మొక్కలు నాటుట, కంపోస్టు ఎరువుల తయారీ వంటి పనులను చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ‘పనుల జాతర’ కార్యక్రమం మొదలు కానుంది. వీటికి సంబంధించి మంత్రి సీతక్క యుద్ధ ప్రాతిపదికన పనులను గుర్తించి వాటిని పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే పనుల జాతర కార్యక్రమ పర్యవేక్షణ డీఆర్‌డీఏ,పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పంచాయతీ భవనాల నిర్మాణం, పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్ల నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు,వ్యవసాయ పోలాలకు మట్టిరోడ్లు తదితర పనులను గ్రామసభలో వివరించనున్నారు. పంచాయతీల్లో నిధులు లేకున్నా మంజూరు చేస్తామనడం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామంలో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2005న శంకర్ సముద్రం రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని సంకల్పంతో నిర్మాణ పనులు ప్రారంభించి 20 ఏళ్లు గడుస్తున్నా నేటికీ ముంపు నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నిక్సన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం నిర్వాసితులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ప్రత్యేక రాష్ట్రంలోనూ కానాయపల్లి గ్రామ ముంపు నిర్వాసితులకు న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. న్యాయం చేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం చేయాలి

గోపాల్‌పేట: ఇళ్లు కూలిపోయిన బాధితులకు వెంటనే తగిన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం మండల నాయకుడు మహేష్ అన్నారు. ఏదుల మండలంలోని చీర్కపల్లి గ్రామంలో అకాల వర్షాలకు కూలిన రెండుఇండ్లతోపాటు మండలంలో ఇండ్లు కూలిపోయిన అందరినీ ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏదులలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న వారికి వెంటనే ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని కోరారు. అలాగే గ్రామ సమస్యలను వివరించి త్వరగా పరిష్కరంచాలని అన్నారు.

అధ్యాపకులకు అభినందన



పాన్‌గల్‌లో శంకర్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు



నారాయణచారిని సన్మానిస్తున్న అధ్యాపకులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న శంకర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు, అధ్యాపక బృందం వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మకూర్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత అధ్యాపకుడు నారాయణచారి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ప్రిన్సిపల్ సైదులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ నుంచి కొత్తగా విధుల్లో చేరిన నారాయణచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గణితంలో డాక్టరేట్ సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కమిటీ ఎన్నిక

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో గురువారం మండల ముదిరాజ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పాలెం పెద్దిబాలయ్య, పండుగసాయన్న విగ్రహ కమిటీ కన్వీనర్‌గా వాకిటి రాజమౌళి, మండల యూత్ అధ్యక్షుడిగా టీజీ మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైనా వారిని సభ్యులు సన్మానించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో నిధులు లేక కార్యదర్శులు డబ్బులు ఖర్చు చేయలేక అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటన్న, పోషన్న, అంజి పాల్గొన్నారు.

అమరచింత: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చేపట్టేందుకు నిధులు లేక పంచాయతీ కార్యదర్శులు కనీసం బ్లీచింగ్ పౌడర్ సైతం చల్లడం లేదని, ప్రభుత్వం వెంటనే గ్రామాలకు పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం నిధులను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గురువారం తహసీల్దార్ రవికుమార్‌యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు రాజు.మండల కార్యదర్శి రాజన్న, మురళి, మన్నెం, రాంచందర్, సత్యన్న పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: నిధులు మంజూరు చేసి పారిశుద్ధ్య పనులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి బోయిన్‌పల్లి గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బురన్, నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్డిసేవా సమితి సమావేశం

వనపర్తి విద్యావిభాగం: రాజా బహదూర్ వెంకట్ రాంరెడ్డి జయంతి సందర్భంగా నేడు జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవాసమితి కల్యాణమండపంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు రెడ్డి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు సన్మానం చేయడంతో పాటు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానం చేస్తామని తెలిపారు. జిల్లాలోని రెడ్డి సోదరులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రాష్ట్రానికి పూర్తిస్థాయిలో యూరియా రావడం లేదని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలంగాణ చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి అన్నారు. గురువారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులు ఉదయం ఐదుగంటల నుంచి యూరియా కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు క్యూలో నిల్చుంటే యూరియా లేదంటూ బోర్డు పెట్టి వెళ్లిపోండి అంటు చెప్పడం ఏమిటని రైతులంటే అలుసుగా ఉందా అంటు ప్రశ్నించారు. రైతులకు, పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయశాఖ అధికారులమధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటు చేసుకోవడంతో సీఐ శివకుమార్ ఇక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. క్యూలో నిల్చున్న రైతులందరికి టోకేన్లు జారి చేస్తామని శుక్రవారం టోకెన్లు పొందిన రైతులకు యూరియా అందిస్తామని చెప్పడంతో నాయకులు, రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లాకోశాధికారి వెంకటేష్, తెలంగాణ వ్యవసాయసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్‌తోపాటు రైతులు, వ్యవసాయశాఖ, పీఏసీఎస్ అధికారులు తదితరులు ఉన్నారు.

200 మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీ..

మండలంలో ఇదివరకు రైతులకు 200 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేసామని ఇంకా ఎంతకావాలన్న ఇస్తామని మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు ప్రస్తుత దోసుకు అవసరమైన మేరకే యూరియాను తీసుకెళ్లాలని, రోజుకు 25 టన్నుల చొప్పున పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని వివరించారు.

బీటీ పనులు చేపట్టాలి..



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ఆదేశాల మేరకు గురువారం మండల పార్టీ అధ్వర్యంలో స్థానిక సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై, ఎన్‌హెచ్–44 నుంచి పెద్దగూడెం వరకు బీటీ రహదారి నిర్మించాలని గురువారం పాదయాత్ర నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, స్థానికల సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ పురుషోత్తంరెడ్డి పాల్గొని మాట్లాడారు. 2022లో మంజూరై, రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు వాటర్‌ఫ్లోర్ బ్రిడ్జి పనులు పూర్తిచేసి, బీటీ కార్పెటింగ్ ఆపివేశారన్నారు. దీంతో పెద్దగూడెం నుంచి కదుకుంట్ల, మెంటేపల్లి విలియంకొండ ఎన్‌ఎచ్ 44 వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే నాచహల్లి నుంచి వనపర్తి వరకు రహదారిపై వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని త్వరగా మరమ్మతులు చేయాలన్నారు. ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పెద్దిరాజు, జిల్లా నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సందావెంకటేష్, కుమారస్వామి, బాలరాజు, గొర్ల బాబురావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి



ఐఐటీ మెటీరియల్స్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ

వనపర్తిటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదివినప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతూ, సమాజంలో గొప్ప పేరును సంపాదించుకుంటారని డీఈఓ అబ్దుల్‌ఘని అన్నారు. గురువారం బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గురురాజు యాదవ్ విద్యార్థులకు ఐఐటీ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు దాతల ద్వారా ఐఐటీ మెటీరియల్స్ సమకూర్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పాఠశాలలో డీఈఓ ఐఐటీ ఫౌండేషన్ మెటీరియల్స్‌ను ఆవిష్కరించి, 8వ తరగతి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మద్దిలేటి, గణిత ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీఐ శివకుమార్

అమరచింత: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా పట్టణంలో నేరాలను నియంత్రించవచ్చని సీఐ శివకుమార్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం వర్తక సంఘం కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా వంద పోలీసులతో సమానమన్నారు. పట్టణంలోని ప్రధాన వీధులతో పాటు వ్యాపార సముదాయల వద్ద, చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి అవసరయ్యే నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. ప్రజలందరూ తమకు తోచిన విధంగా విరాళాలు అందించాలన్నారు. వచ్చిన డబ్బులను పోలీసులు, వర్తక సంఘం సభ్యులతో జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేసి వాటి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. వర్తక సంఘం సభ్యులు మున్సిపల్ ద్వారా ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. సమావేశంలో మేనేజర్ యూసుఫ్‌పాటు పలువురు పాల్గొన్నారు.

గుంతలు తవ్వారు.. పూడ్చడం మరిచారు..



భగీరథ చౌరస్తాలో బోల్తా పడిన ఇటుకల ట్రాక్టర్

కొత్తకోట రూరల్: పట్టణంలో మున్సిపాలిటీ కేంద్రం లోని భగీరథ జంక్షన్ సమీపంలో కొత్తగా నిర్మాణం చేపట్టిన ఏటీఆర్ కన్వెన్షన్ హాల్ దగ్గర మురుగునీరు బయటకు పంపించేందుకు రహదారి తొవ్వి పైపులు వేశారు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేయడంతో అక్కడ పెద్ద గుంతగా మారింది. దీంతో గురువారం ఇటుకపెళ్ల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడి కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతిరోజూ ఈ మార్గం నుంచి వందలసంఖ్యలో వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు గుంతలో చిక్కుకుని ప్రయాణం కష్టసాధ్యమవుతోంది. రోడ్డుపై ఉన్న ఈ గుంతను అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు, వాహనదారులు అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి



శ్రీకృష్ణుడి ప్రతిమతో ఊరేగిస్తున్న భక్తులు

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని సోళీపురం గ్రామంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలను త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని ప్రతిమను ప్రత్యేకమైన పల్లకీలో ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఉదయం సోళీపురంలో ఊరేగింపు నిర్వహించి, మధ్యాహ్నం మండల కేంద్రంలో పెట్రోల్‌బంకు దగ్గరి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పూజల్లో సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.బస్టాండులో పెద్ద ఎత్తున భక్తులు, కమిటీ వారు నాయకులు కోలాటం వేశారు. కార్యక్రమంలో రాఘవేంద్రాచారి, రవికుమార్, మనోహర్, రమేష్ పాల్గొన్నారు.